
ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

శుభ

(1971 జూలై, సినిమారంగం నుంచి పునర్ముద్రణ)



సినిమారంగంలోకి ప్రవేశించడానికి కొందరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదు. మరి కొందరు ఏ మాత్రం ప్రయత్నించకుండానే అవకాశాలే వెతుక్కుంటూ వస్తాయి.

శుభ రెండో తెగకు చెందిన యువతి.

ఇటీవల జరిగిన ఓ సంఘటన. ఒక తమిళ చిత్ర నిర్మాత ఒక పేరు మోసిన తమిళ హీరోను బుక్ చేశాడు. అతని పక్కన నాయికగా చక్కని నటనానుభవంగల చలాకీ తార కావలసివచ్చి ఇప్పుడున్న తారలు లాభం లేదని కొత్త నటికోసం అన్వేషించసాగాడు. ఒక రోజు ఆ హీరో ఎక్కడో ఈ యువతి ఫోటోలను చూడడం జరిగింది. వెంటనే ఆ అమ్మాయిని బుక్ చేయమని సూచించాడు.

అలా ఏక్ దమ్ము న తారా మండలానికి ఎగబ్రాకింది ఈ తెలుగు వనిత శుభ.

పదహారేళ్ళ మిసమిసలాడే నూత్న యౌవనంలో ఉన్న శుభ బహుశా 1971 ముగిసేలోగా అగ్రశ్రేణి తారల జాబితాలోకి చేరిపోవడానికి కేవలం అదృష్టం తోడ్పడుతుందనుకోనక్కర్లేదు. ఈమెలో స్వతహాగా శక్తి సామర్థ్యాలున్నాయి. చిన్నప్పట్నించీ విపరీతంగా తెలుగు, తమిళ, హిందీ, ఆంగ్ల, మలయాళ చిత్రాలను చూస్తూ, తనలోని ప్రతిభా సంపదకు సక్రమమైన బాహ్య రూపం ఇవ్వడానికి ఆదిలోనే ఎంతో శ్రమించింది కనుకే నాలుగైదు చిత్రాలలో నటించాక అలవడే అనుభవం, సినిమా సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందే గడించింది.

నటన అనేది దైవదత్తమైన కళ. అందుకే శుభ కారణజన్మురాలు. పైగా ఒకప్పుడు అఖిల భారత ప్రేక్షకులను తన అందచందాలతో, అసమాన నటనా కౌశలంతో ఆకట్టుకున్న నటీమణి పుత్రిక. అంతేకాదు, ఈమె తండ్రి కూడా అఖిల భారత ఖ్యాతి నార్జించిన దర్శకుడు.

ముఖం తీర్చి దిద్దినట్లుండి ఏ లోటుపాట్లూ లేకుండా ఉండడంవల్ల శుభకు మేకప్ ఓ సమస్య కాదు. కేవలం కెమెరా కోసమే పుట్టిందా అనిపించేంతటి ఫోటోజెనిక్ ఫేస్ అనడానికి ఈ ఫోటోలే సాక్ష్యాలు.

చురుకైన యువతి.. లాస్యంలో సొంపు శరీరంలో సొగసు నడకలో వయ్యారం. చూపుల్లో లావణ్యం, కళ్ళల్లో కాంతి, మూర్తిలో పరువం ఇవన్నీ భగవంతుడు ఈమెకి ఇచ్చిన వరాలు. చర్చ్‌పార్క్ కాన్వెంట్‌లో విద్యాభ్యాసం ముగించాక స్టెల్లా మేరీస్ కాలేజీలో పియుసి ఫస్ట్ క్లాస్‌లో పాసయింది. ఇంగ్లీషు అనర్గళంగా, మాతృభాష తెలుగు స్పష్టంగా, తమిళం నిర్దుష్టంగా హిందీని ముద్దుగా మాట్లాడగలదు. సంగీతం కూడా వచ్చు.

శ్రీ వెంపటి చిన సత్యం వద్ద కూచిపూడి నృత్యాన్ని కె.జె. సరస వద్ద భరతనాట్యాన్ని క్షుణ్ణంగా అభ్యసించింది. కనుక చక్కని ఒంపులు సొంపులు గల శిల్పంలాంటి ఈమె ముఖంలో పరిపుష్టికరమైన భావప్రకటన కూడా ఈమె సొత్తు అయింది. ఎదుటివారిలో తను ఏ నాటికైనా మహోన్నతమైన నటి కాగలనన్న భావాన్ని ఇట్టే కలిగించగలదు.

ఉత్తరోత్తరా ఏదైనా చిత్రంలో ఒక కథానాయిక పాత్ర కనిపిస్తే "ఈ పాత్రే శుభ ధరించి ఉంటే ఎంత బావుండేదో!" అనిపించేంతటి సమర్థురాలు. ఆత్మ విశ్వాసం, ఆత్మస్థయిర్యం, పట్టుదల ఈమెకున్నాయి.

ఈమె ప్రతిభా విశేషలను పరిశ్రమలోని పలువురు గుర్తించడానికి ఎంతో కాలం పట్టదు.

సుప్రసిద్ధ డైరెక్టర్ వేదాంతం రాఘవయ్య, అలనాటి నటీమణి సూర్యప్రభ పుత్రిక ఈ శుభ.

"మా అమ్మాయి నన్ను మించిన నటి అయితే, అంతకన్నా కావలసిందేముంది?" అంటుంది సూర్యప్రభ.

"తథాస్తు!" అంటుంది 'సినిమారంగం.'

Post your comments